



టెస్ట్‌ట్యూబ్ బేబీ అనే ఐడియా అమలు పరచడంలో అవసరమైనంత కాకపోయినా ఇందులో వున్న ఇతివృత్తంతో కథ రాయడానికి కొంత సాహసం అవసరమే.

ఈ కథలో కాత్యాయని సగటు - అధునాతన- భారతయువతి. ఈమె స్వతంత్రంగా ఆలోచించ గలదు. సెంటిమెంట్ల మూర్ఖత్వంనుంచి తప్పుకో గలనని నమ్ముతుంది. డబ్బువుంటే తప్ప కొన్ని పన్లు జరగవని స్పృహవుంది. అవినీతిలో పడ కుండా డబ్బు సంపాదించగలిగితే అదిగొప్ప విష యమని భావించగలదు. అదుకని నేలవిడిచి సాము

చేయడానికి సాహసించింది. కాని ప్రకృతి సిద్ధంగా వుండే భావం ఇలాంటి కాత్యాయనుల వేలమంది పెట్టు అందుచేత ప్రకృతి ఆమెను గెలిచింది. అధునాతన భారతీయ యువతి ఎన్ని సెంటిమెంట్లను కాదన్నా ఏక్కడో ఒక దగ్గిర ప్రకృతి కృతిగా మిగిలిపోక తప్పలేదు. ఇతివృత్తంలో నేలవిడిచి సాము వున్నా కథనంలో లేకపోడం విశేషం!

—భమిడిపాటి రామగోపాలం.

గ్లాస్ డోర్స్ తెరుచుకొని లోపలికొచ్చిన ఆమెవంక చూసి, సోఫాలోంచి లేచి 'రండి'అన్నాడు ధనరాజ్.

ఆహ్వానమిచ్చినా ఆమెలో సంకోచం విడిపోలేదు.

'నిలబడిపోయారేం. రండి. కూర్చోండి' అంటూ ఎదురుగా వున్న సోఫా చూపించి కూర్చున్నాడు ధనరాజ్.

ఆమె కూర్చుంది—అంతవరకూ లేని సిగ్గు ఆయనను చూసే సరికి ఒక్కసారి ఆవరించిందామెను.

"మీరు కాత్యాయిని కదూ."

తలెత్తి అతని ముఖంలోకి చూసి అవునన్నట్లు తలూపింది.

విషయాన్నెలా ప్రారంభించాలో అతనికి తోచకుండా వుంది. అతని నోటి వెంబట ఎటువంటి ప్రశ్న వస్తుందోనని ఆమెకు ఆందోళనగా వుంది.

'మేగజైన్స్ చూస్తూండండి' అంటూ లేచి లోపలికెళ్ళాడతను.

సంతృప్తిగా నిట్టూర్పు విడిచి తలెత్తి గదిని పరికించింది. కాత్యాయిని. అందమైన అద్దాల పెట్టెలాంటి గది, ఖరీదైన సోఫాలు, నేలంతా పరుచుకున్న ఎర్రటి కార్పెట్టూ, గోడలకు మోడ్రన్ పెయింటింగ్సూ.

'ఈ నిర్ణయం తీసుకోడంలో తను తొందర పడలేదుగద'ఒక్క మారు తనను తాను ప్రశ్నించుకుంది కాత్యాయిని. నిర్ణయం తీసుకున్నప్పుడు లేని భయం ఇప్పుడు కొత్తగా ఆమె మనసు నావరించింది.

తలుపు తెరచుకొని లోనికొచ్చాడు ధనరాజ్. ధైర్యంగా తలెత్తి అతని ముఖంలోకి చూసింది. వయసు నలభై అయిదుకి మించదు. వంకీల జుట్టు, ఎర్రని ధృడమైన శరీరము, కత్తిరించిన మీసం ముఖానికెంతో

గాంభీర్యాన్ని తెచ్చి పెడ్తోంది. సిల్కు లాల్చీ, పైజామ వేసుకున్నాడు. భుజంమీద ఖరీదైన షాలువ వ్రేలాడుతోంది.

చేతిలోనున్న ఫైల్ బల్లమీదుంచి ఆమె కెదురుగా కూర్చున్నాడు ధనరాజ్.

ట్రేతో కాఫీలు పట్టుకొచ్చాడు నౌకరు.

'తీసుకోండి' అంటూ తనూ తీసుకున్నాడు ధనరాజ్.

కాఫీ తీసుకుని సిప్‌చేసింది కాత్యాయిని.

"మీరు బియ్యే చదివినట్లున్నారు. ఏ వుద్యోగానికైనా ట్రై చెయ్యలేదా" ఎడంచేత్తో ఫైల్ తిరగేస్తూ అడిగాడు.

"బియ్యే పాసయ్యాక ఏడాది క్రితం వరకూ నేను ఎప్లైయ్ చెయ్యని వుద్యోగమంటూ ఏంలేదు. కాని యీ మధ్యే ఆ ప్రయత్నంనుంచి విరమించుకున్నాను."

"ఎంచేతో?"

"పరపతీ, డబ్బూలేని మావంటి వాళ్ళకీ రోజుల్లో వుద్యోగా లొస్తున్నాయా చెప్పండి!

ఆ మాటకు ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడు ధనరాజ్. ధైర్యమూ చలాకీదనంతోపాటు తెలివితేటలు కూడా కన్పించాయామె కళ్ళలో.

"అన్నీ ఆలోచించుకునే మీరీ నిర్ణయం తీసుకున్నారా?" అన్నాడు ప్రస్తుత విషయానికొస్తూ. కాత్యాయినేం మాట్లాడలేదు. ఈలోగా ధనరాజే అన్నాడు."నాకిది అత్యాసే కావొచ్చు. కానీ సహజమైన కోరికమాత్రం కాదు."

కాత్యాయిని తలెత్తి అతని వంక ఆశ్చర్యంగా చూసింది.

"ఈ ఎడ్వర్‌టైజ్‌మెంటు చూడగానే మీకే మనిపించింది?" అన్నాడు ఆమెవంక చూస్తూ.

"మొదట చాల ఆశ్చర్య మనిపించింది. ఎక్కడో ఏ విదేశాల

లోనో యీ పద్ధతి వుందని విన్నాను గాని మన దేశంలోకూడ టెస్ట్ ట్యూబ్ బేబీస్ అనే ఐడియా కార్యరూపానికి వస్తుందని నాకు తెలీదు." అని, అనకూడనిదేదో అన్నట్లు తలొంచుకుంది.

"అయితే మీరు మనస్ఫూర్తిగా యిష్టపడే ఇందుకు సిద్ధపడ్డారనుకుంటాను." అంటూ ఆమెవంక చూశాడు ధనరాజ్.

అవునన్నట్లు తలూపింది కాత్యాయిని.

"మీ వివరాలన్నీ అప్లికేషన్‌ద్వారా తెలిసాయి కాబట్టి నా స్వవిషయాలుకూడ మీకు చెప్పాల్సిన బాధ్యత నాకుంది. ఇఫ్ యూ డోంట్ మైండ్ ప్లీజ్ ఫాలోమీ" అంటూ లేచాడు ధనరాజ్.

అతని ప్రవర్తన కొశ్చర్యం కలిగినా అతని వెనుకే కదిలింది కాత్యాయిని. వెళ్ళి ఓ లైఫ్ సైజు ఫోటో దగ్గర ఆగాడు ధనరాజ్. ఆ ఫోటోలో వున్న ఆవిడకు పాతికేళ్ళుంటాయి. అందంగా కుందనపుబొమ్మలా వుంది. ఆ అందం వెనుక గర్వం, ఠీవి కన్పిస్తున్నాయి.

"నాకు కొన్ని లక్షల ఆస్తివుంది. అంతస్థుకు సరిపోయే మేడలూ కార్లూ వున్నాయి. కానీ లేనిదొక్కటే: మనశ్శాంతి" అంటూ కాత్యాయిని ముఖంలోకి చూశాడు.

కాత్యాయిని అతనివంక చూట్టంలేదు. గదినంతా ఆసక్తిగా పరికిస్తోంది.

"మా తల్లి దండ్రులకు సంతానం నేనొక్కడినే. కానీ నాకు ఆ అదృష్టమూ లేదు. ఆ బెంగతోనే నా భార్య కుముదం పోయింది." అంటూ ఫోటో వంక చూసి తలొంచుకున్నాడు.

"అప్పట్లో బిజినెస్‌లో పడి నేనంతగా పట్టించుకోలేదు. కానీ యీ వంటరి బ్రతుకు ఇప్పుడు దుర్భరంగా తోస్తూంది. మళ్ళీ పెళ్ళి చేసుకునే ప్రసక్తి లేదు. కాని వారసుడు కావాలి. ఎట్లా? ఆ సమయంలోనే నా మిత్రుడు రాజేష్ నాకి ఆలోచనా ఇచ్చాడు. రాజేష్ అమెరికాలో చదివి

అక్కడే కొన్నాళ్ళు ప్రాక్టీసు చేసి చేయి తిరిగిన డాక్టర్‌గా తిరిగొచ్చాడు. అతని సలహా నాకూ నచ్చింది. నాతో శారీరక సంపర్కం లేకుండా నాకొక పిల్లవాడిని కనియిచ్చే అందము, ఆరోగ్యమూ తెలివితేటలూ గల కన్య కావాలని ప్రకటించాను. నా అపనమ్మకాన్ని గేలి చేసేటట్లు ఇరవై అప్లికేషన్లొచ్చాయి. అందులోంచి మూడుమాత్రమే తీశాను. మీరు మొదటివారు."

కాత్యాయిని మాట్లాడకుండా ధనరాజ్ వెనకే నడుస్తోంది. క్రింది గదులూ, మేడ బాల్కనీ, అక్కడ్నించి చుట్టూవున్న తోట అన్నీ చూపించాడు ధనరాజ్.

"సంతానంమీద అంత కాంక్ష వున్నవాళ్ళు మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు?" క్రిందికొచ్చి సోఫాలో కూర్చున్నాక అడిగింది కాత్యాయిని. తలెత్తి ఒక్కసారి ఆమె ముఖంలోకి చూసి ఇబ్బందిగా కదిలాడు ధనరాజ్.

"ముకుందం అందరిలాంటి స్త్రీ కాదు. నిజం చెప్పాలంటే ఆమె నాకు భార్యేకాదు. గురువు, దైవం అన్నీ. అందుకే భౌతికంగా దూరమైనా నా మనసునుండి మాత్రం దూరం కాలేదు" అన్నాడు.

కాస్సేపు యేవరూ యేం మాట్లాడలేదు.తర్వాత ధనరాజే అన్నాడు. "మీరు పూర్తిగా అంగీకరించినట్లయితే రాజేష్‌కి ఇప్పుడే ఫోన్ చేస్తాను. ముందుగా ఆరోగ్య విషయమై కొన్ని టెస్ట్‌లు అవసరమౌతాయేమో."

"నేనన్నీ ఆలోచించుకునే వచ్చాను. ఇంకా ఆలోచించే అవసరం లేదు. ఇక ఆరోగ్య విషయమంటారా! నాది గట్టి శరీరమే. మీకా భయం లేదు" అంది కాత్యాయిని ధైర్యంగానే.

ధనరాజ్ లేచి లోపలికెళ్ళి రాజేష్‌తో ఫోన్‌లో మాట్లాడి వచ్చాడు.

"రాజేష్ రేపు వుదయం వస్తాడట. మీ ఆరోగ్యం విషయం మీకంటే డాక్టర్లకు బాగా తెలుస్తుంది. అంచేత టెస్టులయ్యాక వీలైతే

పది పన్నెండు రోజుల్లోనే మీరందుకు సిద్ధపడాల్సి వుంటుంది. అంత వరకూ మీరు కావలిస్తే మా అవుట్‌హౌస్‌లో వుండొచ్చు" అన్నాడు.

"నో థాంక్స్. నేను వేరేగా పోర్షన్ తీసుకుని వుండాలనుకుంటున్నాను" అంటూ లేచింది కాత్యాయిని.

"సరే. మీ ఇష్టం"

* * *

సీలింగ్ ఫేను నెమ్మదిగా తిరుగుతూంది. రెండు చేతుల్నీ తలక్రింద పెట్టుకుని మంచంమీద వెల్లకిలా పడుకుని తదేకంగా చూస్తూంది కాత్యాయిని.

వారం రోజులయి తన శరీరంలో యేదో వింతమార్పు కనిపిస్తోంది. కడుపులో యేదో చలనం....స్పర్శ .. డబ్బుకోసం పెళ్ళి కాకుండానే, పురుషుడి స్పర్శ లేకుండానే సంతానాన్నిచ్చే సాధనంగా తయారైంది తను. పవిత్రంలేంటే మాటలా: సంతానమన్నా మాటలుకాదు. తనకు డబ్బూ ఆయనకు సంతానమూ. అంతే! .. ఒక్క ఆర్నెల్లు. కళ్ళు మూసుకుని యీ అజ్ఞాతవాసం గడిపేస్తే....బాధగానైన యీబాధ్యతను నెరవేరిస్తే తన జీవితమంతా వెలుగే! డబ్బుందంటే పెళ్ళి చేసుకోవడానికి క్యూలో బోలెడంతమంది: లేదూ? మహా మంచిది! పున్నమినాటి పువ్వులా జీవితాన్ని గడిపేయగలదు.

కానీ....కానీ... యీ మధ్యలో యేమైనా అయితే?

డబ్బు గురించి బెంగలేదు. అయిదువేలూ తన పేర బేంకులో వేసి పాస్‌బుక్ చేతికిచ్చి మరీ వెళ్ళాడు ధనరాజ్. ఇక బెంగంతా తన పరిస్థితి గురించే.

ఆ మాటకొస్తే తనిప్పుడు ఆరోగ్యంగానే వుంది. శరీరానికి లావూ నిగారింపూ వచ్చాయి. రావూమరి? మూడు పూటలా పాలూ, పళ్ళూ, బలమైతిం ...

అనుకోకుండా డొక్కలో వచ్చిన నొప్పికి గిజగిజలాడింది కాత్యాయిని. ఆమె మస్తిష్కంలోని ఆలోచనలన్నీ ఒక్కసారి పటా పంచలైనాయి.

* * *

కాత్యాయిని మస్తిష్కంలోని ఆలోచనలన్నీ ఒక్కసారి పటాపంచలైనాయి ఆ గొంతు విని. కప్పుకున్న దుప్పటిని గుండెలమీదికి లాక్కొని సర్దుకుని చూసిందతనివంక.

గోధుమ రంగు పట్టు లాల్చీ, పంచి, భుజాలమీంచి వేలాడే స్నఫ్ కలర్ కాశ్మీర్ శాలువా.

ఆ ముఖంలో ఎంతానందం?

"ఎలావుంది మీ వంట్లో?" అడిగాడు మళ్ళీ.

ముఖానికి కాస్త నవ్వు పులుముకుని 'ఫర్వాలేదు' అన్నట్టు తలూపింది కాత్యాయిని.

తొట్టెలోని వారసుడివంక తదేకంగా చూస్తున్నాడు ధనరాజ్. అతని కళ్ళు సంతృప్తిగా మెరుస్తున్నాయి.

"పుత్రోత్సాహము తండ్రికి...." పద్యం గుర్తొచ్చిందికాత్యాయినికి.

"మీ ఆరోగ్యం జాగ్రత్త! మీకేది అవసరమైనా కబురుపంపండి."

వెళ్ళిపోతున్న ధనరాజ్‌వంకే చూస్తూండిపోయింది కాత్యాయిని.

ఆ తర్వాత రెండు మూడు రోజులు రోజూ సాయంత్రం డాక్టర్‌తోపాటే వచ్చి చూసేవాడు ధనరాజ్.

"నేనింకా ఇక్కడ యెన్నాళ్ళుండాలి డాక్టర్?" అడిగిందో రోజు.

"బాగా కోలుకునేవరకూ" అన్నాడు రాజేష్ ధనరాజ్‌వంక చూస్తూ.

"నేను బాగానే వున్నాను డాక్టర్. ఇంకా ఎన్నాళ్ళు ఇలా ఒకరికి భారమవడం? నా కిష్టం లేదు" అంటూ ధనరాజ్ వంక చూసింది.

ధనరాజ్ కాస్సేపేం మాట్లాడలేదు. తర్వాత అన్నాడు.

"చూడండి కాత్యాయినిగారూ! ఏ విధమైన సంబంధమూ లేకపోయినా మనమొక బంధానికి కట్టుబడ్డాం. కాబట్టి పుట్టిన పాపకి పై మీకూ కొంత బాధ్యత వుంది."

"నో. నో.... బాధ్యతలు నాకేం లేవు ఒప్పందం ప్రకారం నా కర్తవ్యం నేను నెరవేర్చాను. నన్ను పంపిస్తే సంతోషిస్తాను" అంది కాత్యాయిని అతని మాటలకు మధ్యలోనే అడ్డు తగిలి.

ధనరాజ్ వెంటనే మాట్లాడలేకపోయాడు.

"పోనీ....మంచి ఆయా దొరికేవరకైనా మీరొక నెలపాటు వాడి పోషణ చూడాలని నా కోరిక. ఇది మన ఒప్పందంలో లేదు. ఒప్పుకుంటాను. దీనికి మీరెంత చార్జి చేసినా ఫర్వాలేదు."

ధనరాజ్ మాటలకు దెబ్బతిన్న పులిలా చూసింది. ఆ వెంటనే సంబాళించుకుంది. అవును! డబ్బుతో కాక తనకేం సంబంధం?

"మీ రాలోచించుకునే చెప్పండి. తొందరలేదు" అన్నాడు ధనరాజ్.

"ఒక్క నెలే అయితే నా అభ్యంతరంలేదు" అని రెండ్రోజుల తర్వాత తన అంగీకారాన్ని తెలియజేసింది కాత్యాయిని.

* * *

బోట్ హౌస్‌లోకి అడుగుపెట్టిన ధనరాజ్ ఆశ్చర్యంగా వుండిపోయాడు. ఇంట్లో కాత్యాయినిలేదు. ఉయ్యాలతొట్టెలో బాబూలేడు. కాని బాబు స్థానంలో ఉత్తరముంది. వణికే చేతులతో అందుకున్నాడు దాన్ని ధనరాజ్.

ధనరాజ్‌గారికి,

ఈ రోజుతో నెల్లాళ్ళ గడువూ పూర్తయింది. మీకు చెప్పి వెళ్ళాల్సింది చెప్పకుండానే వెళ్ళిపోతున్నందుకు నన్ను క్షమించండి. ఈ పాటికి కారణం గ్రహించే వుంటారు. డబ్బుంటే ఏమైన చెయ్యొచ్చని

సంబరపడ్డాను. డబ్బుంటే మరేం అక్కర్లేదని విర్రవీగాను. ఆ గర్వం తోనే ఏ స్త్రీ చెయ్యలేని ధైర్యం చెయ్యగలిగాను.

కానీ .. కానీ... నే నోడిపోయాను ధనరాజ్‌గారూ. కన్యగా, ఓ పిల్లాడి తల్లిగా నే పొందిన అనుభూతి యీ జన్మలో మరువలేనిది. ఆ అనుభవం ఎంత అందమైంది? ఆ అనుభూతికోసం ఎన్ని పుణ్యాలు చేసి పుట్టాలో! తన రక్తంలోని వేరొక రూపం! ఆ స్పర్శ, ఆ చిన్ని నవ్వులు ఆ కేరింతలు ...మాతృత్వం యింత తీయనిది కాబట్టే ప్రతి స్త్రీ ఇందు కోసం ఆరాట పడుతుందని తెల్సుకున్నాను. పాలు పట్టడంలో, నీళ్ళు పోయడంలో ఎంత అనిర్వచనీయమైన ఆనందముందో అనుభవ పూర్వ కంగా తెల్సుకున్నాను. అటువంటి బాబుని విడిచి వెళ్ళగలనా చెప్పండి ధనరాజ్‌గారూ!

'మీ అమ్మ ఎవతురా?' అని రేపు ఎవరైనా అడిగితే ఏమని చెబు తాడు నా బాబు? అయినా బాబు తప్ప నాకు మిగిలిందేమిటి? ఈ డబ్బు ఆనందాన్నిస్తుందా! మాతృత్వాన్ని సంపాదించ గలదేమో గాని ప్రేమను సంపాదించ కలదంటారా?

నా బాబును విడిచి వుండలేనని నిర్ధారించుకున్నాను ధన్‌రాజ్‌గారూ, మీకు చేస్తున్న ద్రోహం క్షమించరానిదే, నా కంఠంలో ప్రాణ ముండగా నా బాబుకే లోపం రానివ్వనని మాట ఇస్తున్నాను. దయచేసి మా కోసం వెదికించకండి.

మీవల్ల అన్నీ పొందికూడ యేమీ కాలేని కాత్యాయిని."

(జ్యోతి, అక్టోబర్ 1979)